క్లుప్తంగా

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నాయుడుపేట టౌన్ : ఎంపీ చక్కెర పరిశ్రమ సమీపంలో ఉన్న భగవతి మల్లికాంబ ఆలయంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 250 మందికి పైగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి డాక్టర్లు కె.వెంకటరత్నం, ప్రవీణ్ యాదవ్, మునిరాజాతో పాటు చెన్నై శంకర నేత్రాలయం వైద్యులు పరీక్షలు చేశారు. వటుకునందు స్వామి, గూడూరు సుధీర్ రెడ్డి, అవధానం సుధీర్, చెన్నారెడ్డి సుబ్బారెడ్డి, అమాస రామానారాయణ, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మరమ్మతులకు నోచుకోని చేతి బోర్లు



నేతాజీనగర్‌లోని చేతి బోరు దుస్థితి

దొరవారిసత్రం : మండలంలోని నేతాజీనగర్ కాలనీలో మూడు చేతి బోర్లు మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. ఏళ్లు గడుస్తున్నా అధికారులు, పంచాయతీ పాలకులు పట్టించుకోవడం లేదు. వాటికి మరమ్మతులు చేస్తే ఎంతగానో ఉపయోగంగా ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేదలకు ఫల సరుకుల పంపిణీ



ఫల సరుకులు అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని డీఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం గుణ్ణం సేవా ట్రస్టు ఆర్థిక సహకారంతో 25 మంది పేదలకు ఫల సరుకులు అందజేశారు. రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధి డాక్టర్ బత్తల వెంకటక్రిష్టారెడ్డి మాట్లాడుతూ ఓజిలి మండలం బట్ల కనుపూరుకు చెందిన వ్యాపారవేత్త గుణ్ణం మధుసూదన్ రెడ్డి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ఫల సరుకుల పంపిణీకి ఆర్థిక సహకారం అందజేశారని తెలిపారు. ప్రతినిధులు బండి ధనుంజయరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కూచివాడలో వేమాలమ్మకు పొంగళ్లు



ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్తులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని కూచివాడలో ఉన్న గ్రామ దేవత వేమాలమ్మకు ఆదివారం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు. ప్రతి ఏటా గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికులు హాజరై గ్రామ దేవతకు పొంగళ్లు పెట్టుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామస్తులు తమ ఇళ్ల నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టారు. గ్రామ పెద్దలు ఏకొల్లు రమణయ్య శెట్టి, కసాల మురళీశెట్టి, అన్నాడిశెట్టి ప్రభాకర్, వైవీ కృష్ణయ్య పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి టేబుల్ ఫ్యాన్ వితరణ

నాయుడుపేట టౌన్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న మేరీ వృద్ధాశ్రమానికి ఆదివారం ఇందిరా సిల్క్ దిలీప్ టేబుల్ ఫ్యాన్ వితరణ చేశారు. తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధుల కోసం ఫ్యాన్ ఇచ్చినట్టు పేర్కొన్నారు. దాతను ఆశ్రమ నిర్వాహకులు సునీత, బెన్నీ కృతజ్ఞతలు తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

కోట: మండలంలోని తీరప్రాంత గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో కోట నుంచి సిద్ధవరం, గోవిందపల్లి, వావిళ్లదొరువు, కొత్తపట్నం, గోవిందపల్లిపాళెంకు ఆర్టీసీ బస్సు నడిచేది. నేడు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే ఆటోల కోసం వేచి చూడాల్సి వస్తోంది. కోట నుంచి తీరప్రాంత గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని వాకాడు డిపో అధికారులకు వినతి పత్రం అందజేసినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. మండల సర్వసభ్య సమావేశంలో బస్సు నడపాలని ప్రజా ప్రతినిధులు ఆదేశిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజలు, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇసుక కోసం తప్పని తిప్పలు

టిప్పర్ ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇళ్ల నిర్మాణదారులు వాపోతున్నారు. వాహనాలను తీసుకుని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు. ఉచితం అంటూనే డబ్బు వసూలు చేస్తున్నారని, డబ్బు చెల్లించినా సమయానికి ఇసుక దొరకక పనులు ఆగిపోతున్నాయని అంటున్నారు. స్టాక్ పాయింట్లు పెంచి ఇసుక అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ఇసుక స్టాక్ పాయింట్ వద్ద తప్పని నిరీక్షణ
- ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు, వినియోగదారులు



స్టాక్ పాయింట్‌లో ట్రాక్టర్‌కు ఇసుక లోడింగ్

దొరవారిసత్రం : సూళ్లూరుపేట, ఓజిలి, తడ, దొరవారిసత్రం తదితర ప్రాంతాల వారి కోసం దొరవారిసత్రం మండలంలోని మావిళ్లపాడు సమీపంలోని ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటుచేశారు. మరొక చోట స్టాక్ పాయింట్ లేకపోవడంతో ఇక్కడికి వందల సంఖ్యలో టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు వస్తున్నాయి. అవి జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నాయి. డ్రైవర్లు పాయింట్ వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో ఇటు వినియోగదారులు, అటు డ్రైవర్లు, వాహనదారులు తినేందుకు తిండి లేక, తాగేందుకు నీళ్లు లేక నరకం చూస్తున్నారు. మావిళ్లపాడు వద్దకు అనుదినం సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట, ఓజిలి, తదితర ప్రాంతాల నుంచే కాకుండా గూడూరు నుంచి కూడా ఇసుక కోసం ట్రాక్టర్లు అధిక సంఖ్యలో వస్తున్నాయి. పాయింట్‌లో ఉన్న సిబ్బంది పూర్తి స్థాయిలో లోడింగ్ చెయ్యలేకపోతున్నారు. దీనికితోడు స్లిప్పుల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో నిత్యమూ సిబ్బంది, వాహనదారుల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకుంటున్నాయి.

స్లిప్స్ నుంచి లోడింగ్ వరకు అంతా ఆలస్యమే...

ఇసుక కోసం సుదూర ప్రాంతాల నుంచి స్టాక్ పాయింట్ వచ్చిన దగ్గర నుంచి వాహనాలు లోడింగ్ అయ్యే వరకు చాలా ఆలస్యం అవుతుండడంతో అందరూ విసుకెత్తిపోతున్నారు. క్యూలో ఉన్న వాహనాలకు ఇసుక కోసం స్లిప్స్ ఇచ్చేది ఒక ఎత్తైతే వాహనాలు స్టాక్ పాయింట్‌లోకి వెళ్లి బిల్లులు తీసుకుని నగదు ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేసి లోడింగ్ చేసుకోవడం ఒక ఎత్తు. ఇసుక లోడ్ అయ్యేలోపు తలలో ప్రాణం తోకలోకి వచ్చినట్లు అవుతోందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టాక్ పాయింట్‌లో పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పదుల సంఖ్యలో ఉన్నా ఒకటికి రెండు యంత్రాలు వాహనాలకు ఇసుక లోడ్ చేస్తున్నా.. టిప్పు ఇసుక కోసం అనుదినం ఇబ్బందులు తప్పడంలేదని వాహనదారులు, వినియోగదారులు వాపోతున్నారు.



మావిళ్లపాడు సమీపంలో బారుతీరిన టిప్పర్ లారీలు



స్టాక్ పాయింట్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్లు

ఆర్టీసీ బస్టాండు పరిశీలన



నాయిడుపేట ఆర్టీసీ బస్టాండును పరిశీలిస్తున్న డిప్యూటి సీటీఎం భాస్కర్‌రెడ్డి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ఆర్టీసీ బస్టాండును ఆదివారం తిరుపతి జిల్లా డిప్యూటీ సీటీఎం భాస్కర్ రెడ్డి పరిశీలించారు. బస్టాండులో నెలకొన్న సమస్యలపై ఆరాతీశారు. బస్టాండ్‌లో పైకప్పు పగుళ్లు బారిపోయి ప్రమాదకరంగా ఉండడాన్ని గుర్తించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కంట్రోలర్‌కు సూచించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రయివేటు వాహనాలు రాకుండా చూడాలని, పోలీసులకు సైతం ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

జోరుగా క్రికెట్ పోటీలు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని మోమిడి గ్రామంలో శశికుమార్, శేషేంద్ర జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు జోరుగా సాగుతున్నాయి. ఆదివారం 8 జట్లు తలపడ్డాయి. వీటిలో నాలుగు జట్లు విజేతలుగా నిలిచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం మోమిడి సీటీఎం, పునుగుంటపాళెం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పునుగుంటపాళెం విజేతగా నిలిచింది. అలాగే రెండో మ్యాచ్‌లో అల్లీపురం, నాయుడుపేట మండలం చిగురుపాడు జట్ల మధ్య మ్యాచ్ జరగగా విజేతగా అల్లీపురం జట్టు నిలిచింది. మధ్యాహ్నం లింగవరం, కొత్తపట్నం జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా లింగవరం జట్టు విజేతగా నిలిచింది. నాలుగో మ్యాచ్‌లో క్రిష్ణపట్నం, వర్సస్ వరగలి జట్ల మధ్య పోటీ జరగ్గా వరగలి జట్టు విజేతగా నిలిచినట్లు నిర్వహకులు మోహన్, వినోద్, నాగరాజు, నిరీక్షన్ తెలిపారు.

రేపు మల్లాంలో ఆడికృత్తిక వేడుకలు

చిట్టమూరు (చిల్లకూరు) : మల్లాంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆడికృత్తిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. స్వయంభువుగా వెలసిన సుబ్రమణ్యస్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఆడికృత్తిక వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేస్తామని, ఆరు గంటల నుంచి భక్తులకు దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని పరిమిత సంఖ్యలో భక్తులు పాలాభిషేకం చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఆలయంలోని నూటొక్క స్తంభాల మండపంలో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి కల్యాణం, సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

నిర్మాణ దశలోనే అంగన్‌వాడీ భవనం



నేతాజీనగర్‌లో అధ్వానంగా ఉన్న భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ



గోడలకే పరిమితమైన నూతన అంగన్‌వాడీ భవనం

దొరవారిసత్రం: మండలంలోని నేతాజీనగర్ గ్రామ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అది అధ్వానంగా ఉంది. ఇక్కడ 15 మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఈ కేంద్రానికి 2017–18లో భవనం నిర్మించేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.7.50 లక్షలు, ఐసీడీఎస్ నిధులు రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణలో పనులు ప్రారంభించారు. గోడల వరకు నిర్మాణం పూర్తయింది. తర్వాత పట్టించుకోలేదు. దీంతో పాడుబడిన భవనంలోనే కేంద్రాన్ని నిర్వహించాల్సి వస్తోంది. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంకమ్మ వివరణ ఇస్తూ నిధులు లేకపోవడంతోనే భవన నిర్మాణపనులు ఆగిపోయాయన్నారు.

రెండు వర్గాల మధ్య గొడవ

సూళ్లూరుపేట : పట్టణంలోని కోళ్లమిట్ట ప్రాంతానికి చెందిన రెండు వర్గాల వారు పరస్పరం గొడవ పడ్డారు. ఇందులో సాయి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ కె.రహీంరెడ్డి కథనం మేరకు.. కోళ్లమిట్టకు చెందిన గౌతమ్, సాయి మధ్య ఆర్థిక పరమైన లావాదేవీల విషయంలో 2023లో ఒకరిపై ఒకరు దాడి చేసుకుని కేసుల దాకా వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ప్రాంతంలో అక్కడే వున్న ఓ బిర్యానీ సెంటర్ వద్ద గౌతమ్, అతని స్నేహితులు వుండగా సాయి పాంట్ జిప్ విప్పి చూపించి గొడవలకు కవ్వించాడు. వెంటనే గౌతమ్ కర్రతో సాయిపై దాడి చేశాడు. దీంతో వివాదం తారాస్థాయికి చేరుకుంది. ఈ రెండు గ్రూపుల్లో వున్న యువకులు ఆ ప్రాంతంలో నానా బీభత్సం సృష్టించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ రహీంరెడ్డి అక్కడికి చేరుకుని కొంతమందిని పట్టుకున్నారు. ఈ రెండు గ్రూపులపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ రెండు గ్రూపుల్లో యువకులు గతంలో ఇదే విధంగానే ఆర్థికపరమైన లావాదేవీల్లో గొడవ పడ్డారని ఎస్ఐ తెలిపారు.

అంకమ్మకు ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో అంకమ్మ తల్లి

రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలో ఉన్న పోతుకొండలో కొలువై ఉన్న అంకమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక పుష్పాలతో పూలంగి సేవ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి పొంగళ్లు పెట్టారు.

ముత్యాలమ్మ ఆలయంలో..



చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూ ర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి విశిష్ట పూజలు చేశారు. అనంతరం పూల అలంకరణల చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు త్రిశూలం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. పొంగళ్లు పెట్టారు. ఈఓ నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



వాకాడులో మొక్కలు నాటుతున్న సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు

వాకాడు : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందామని రిజర్వుడు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ గాయం శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఆదివారం వాకాడులో గ్రామస్తులతో కలిసి పలుచోట్ల మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చి సంఘం నాయకులు ప్రశాంత్‌బాబు, దారా అజయ్‌కుమార్, జాలాది కిషోర్, డేనియల్ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా దగ్గవోలు చెరువు కట్ట



దగ్గవోలు గ్రామం చెరువు కట్ట



చెరువు కట్ట మధ్యలో గుంతలు

దక్కిలి: దగ్గవోలు గ్రామంలో చెరువుకట్ట ప్రమాదకరంగా తయారైంది. ఈ చెరువు కింద వందలాది ఎకరాల మాగాణి భూములు ఉన్నాయి. అయితే చెరువు కట్టపై మధ్యలో గుంతలు ఏర్పడి ఉన్నాయి. రానున్న వర్షాకాలంలో చెరువు నిండితే కట్టపై ఉన్న గుంతలు ద్వారా నీరు పైకి వచ్చి ప్రమాదం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు మొదట నుంచి చివరి దాకా అక్కడక్కడా పెద్ద పెద్ద గుంతలుగా తయారైంది. చెరువుకు ఇరు వైపులా ముళ్ల చెట్లు కూడా దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా చెరువు దగ్గర దగసానమ్మ ఆలయం సమీపంలో కట్టపై ఎక్కువగా ఈ గుంతలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. వర్షాకాలం వచ్చే లోపు చెరువుకి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని లేకపోతే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డును కమ్మేసిన ముళ్ల చెట్లు



కడివేడు నుంచి బూదనం వెళ్లే మార్గం



కడివేడు రోడ్డులో పెరిగిన కంప చెట్లు

చిల్లకూరు: ప్రధాన రోడ్లను కంప చెట్లు కమ్మేయడంతో మూసుకు పోతున్నాయి. మండలంలోని వరగలి రహదారిపై చేడిమాల ప్రాంతంలో కంప చెట్లు రోడ్డుకు ఇరు వైపులా పెరిగి పోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపించడం లేదు. అలాగే కడివేడు నుంచి బూదనం వెళ్లే రోడ్డులో చెట్లు బాగా పెరిగి పోవడంతో ఎదురుగా ఎలాంటి వాహనం వస్తుందనే విషయం కూడా అర్థం కాక పలు ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. కనీసం మలుపుల వద్దనైనా చెట్లు తొలగించేలా చూడాలని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజన లేకపోయింది. ఇకనైనా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఇంట్లో చోరీ

చిల్లకూరు : మండల కేంద్రమైన చిల్లకూరులోని కోకోలు గార్డెన్ పరిధిలో ఉన్న ఒక ఇంటిలో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోకోలు గార్డెన్‌లో నివాసం ఉండే శ్రీనివాసులు కుటుంబంతో కలిసి శనివారం ఊరికి వెళ్లి ఆదివారం ఉదయం తిరిగి వచ్చారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడాన్ని చూసి లోపల పరిశీలించారు. బీరువాలోని బంగారు ఉంగరం, జత బుట్ట కమ్మలు, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుధీర్‌కుమార్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 6.171 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.171 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 115, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అపరిశుభ్రంగా వసతి గృహాలు





ఎస్సీ బాలికల వసతి గృహం వద్ద పెరిగిన గడ్డి, డీవీ సత్రం కేజీబీవీ ఎదురుగా అపరిశుభ్రత

దొరవారిసత్రం: మండలంలోని ఎస్సీ బాలికల వసతి గృహం, కేజీబీవీ పాఠశాల చుట్టు పక్కల ఆవరణ పిచ్చిమొక్కలు, గడ్డి, చెత్తాచెదారంతో నిండిపోయి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. దీంతో రాత్రి వేళల్లో దోమలు స్వైర విహారం చేస్తుండడంతో ఆయా గృహాల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఎస్సీ బాలికల వసతి గృహం చుట్టు అయితే పిచ్చిమొక్కలతో నిండిపోయి చాలా దారుణంగా ఉంది. కేజీబీవీ పాఠశాల వద్ద అయితే రెండో అంతస్తు పనులు అసంపూర్తిగా ఉండిపోవడంతో ఎక్కడి మెటీరియల్ అక్కడే ఉండిపోయింది. వీటితో పాటు పిచ్చి మొక్కలు మొలిచి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. వీటి వలన అంటు రోగాలు ప్రబలుతాయని పలువురు ఆందోళన చెందుతున్నారు.

చాలీచాలని పచ్చిరొట్ట విత్తనాలు

రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగించడం వల్ల భూమి సారం కోల్పోతుంది. పంటలను చీడపీడలు కూడా ఆశిస్తాయి. దిగుబడి నాణ్యత తగ్గుతుంది. ఈ నేపథ్యంలో ముందుగా పచ్చిరొట్ట విత్తనాలు చల్లి భూమిలో కలియదున్నితే భూమి సారవంతం అవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తోంది. సూళ్లూరుపేట డివిజన్ పరిధిలోని రైతులకు తగినన్ని పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– సూళ్లూరుపేట రూరల్

- జీలుగల కోసం ఎదురు చూస్తున్న రైతులు
- అధికార పార్టీ నేతలకు ముందు పంపిణీ



స్టాక్ వచ్చిన పచ్చిరొట్ట విత్తనాలు

సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని తడ, దొవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో సుమారు 29 వేల మంది రైతులు ఉన్నారు. సుమారు సూళ్లూరుపేట మండలంలో 584 హెక్టార్లు, దొరవారిసత్రం మండలంలో 378 హెక్టార్లు, తడ మండలంలో 290 హెక్టార్లలో పంటలు సాగు చేస్తారు. ఈ సారి రబీ కింద అక్టోబర్‌లో పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతులు ముందుగా భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, జనుము తదతరాలు చల్లి మొక్కలను కలియదున్నితే భూమి సారవంతం అవుతుంది. అధికారులు అవగాహన కల్పించడంతో రైతులు విత్తనాలు చల్లుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం రాయితీతో విత్తనాలు పంపిణీ చేస్తోంది. సూళ్లూరుపేట సబ్ డివిజన్‌కు సంబంధించి తగినన్ని అందని పరిస్థితి. సూళ్లూరుపేట మండలానికి జీలుగలు 640 క్వింటాళ్లు వచ్చాయి. ఇంకా 150 క్వింటాళ్లు రైతులకు అందాల్సి ఉంది. అలాగే దొరవారిసత్రం మండంలోని రైతులకు 100 వంద క్వింటాళ్లే అందజేశారు. తడ మండలంలో ఇంత వరకు జీలుగలు పంపిణీ చేయలేదు. ఇక్కడి రైతులకు సుమారు 300 క్వింటాళ్ల వరకు అవసరం ఉంది. సూళ్లూరుపేట మండలంలోని దామానెల్లూరు, ఉగ్గుముడి, మంగానెల్లూరు, సుగ్గుపల్లి పంచాయతీల్లో జీలుగలు, పిల్లి పెసర విత్తనాలను అధికారులు అరకొరగానే పంపిణీ చేశారు. అదికూడా ఎక్కువగా అధికార పార్టీ నేతలకు ఇచ్చారని రైతులు ఆరోపిస్తున్నారు. పిల్లి పెసర చల్లే సమయం ఈ నెలతో పూర్తి అయిపోవడంతో చాలా మంది రైతులకు పిల్లి పెసర స్థానంలో జీలుగలు అందజేసి సర్దిచెప్పారు.

జీలుగలు రాలేదంటున్నారు



నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. జీలుగల కోసం వ్యవసాయ అధికారుల వద్దకు వెళితే ఇప్పుడు రావద్దని తిరిగి పంపించేశారు. ఇతరులకు మాత్రం వెంటనే అందజేశారు. అందరికీ అవసరమైన పిచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తామని చెప్పి ఇప్పుడేమో మళ్లీ ఇస్తామని చెబుతున్నారు. విత్తనాలు చల్లే సమయం దాటిపోతోంది.

- మణి, ఉగ్గుముడి గ్రామం

స్టాక్ తక్కువగా వచ్చింది

పచ్చిరొట్ట విత్తనాల స్టాక్ తక్కువగా వచ్చాయి. అధికార పార్టీ నాయకులకు ఎక్కువగా ఇచ్చినట్టు వస్తున్న ఆరోపణలు అవాస్తవం. స్టాక్ వచ్చినంత వరకు అందరికీ సమానంగానే పంపిణీ చేశాం. జీలుగలు ఇంకా అవసరం ఉందని ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టాము. స్టాక్ వచ్చిన తరువాత అందరికీ అందజేస్తాం.

- అనిత, ఏడీఏ